# చావు కూడ బతుకు కంటె విలువైన త్యాగంగా....

కిరణ్

బస్సు చాలా ఆలశ్యంగా వచ్చి ఆగింది. అది నేను పోవాల్సిన రూటులో ఆఖరు బస్సు. అరుపులు, తొక్కిసలాటలమధ్య ఎక్కి కూర్చున్నాను. కొంత గడబిడ తరువాత బస్సు స్టార్టయ్యింది. నాలోపల కూడా జ్ఞాపకాల సినిమా స్టార్టయ్యింది.

'వాడు' నేను కలిసి తిరిగినరోజులు– వాడు నేను దెబ్బలాడుకున్న రోజులు, రోజుల తరబడి చర్చలు, సమావేశాలు జరిపిన సంగతులు, చివరకు వాడు ఈదోపిడి సమాజంమీద కత్తి కట్టినరోజు, ఎన్నో, ఎన్నెన్నో మనసులో మెదులు తున్నాయి. నా ఆలోచనలతో ప్రమేయం లేకుండా బస్సు మూడు గంటలు ప్రయాణం చేసి ఆగి పోయింది. అదే నేను దిగవలసిన స్టేజీ. బస్సుకు కూడా ఆఖరు స్టేజే– ఆఊళ్లో నైట్ హాల్టు కాబట్టి కండక్టరు, డ్రైవరు హోటలు గుడిసెలోనికి నడిచింద్రు.

అదొక పల్లెటూరు. అక్కడినుండి ఆరుమైళ్లు అడివిలో కాలినడకన పెళితే నేను పోవాల్సిన ఊరు వస్తుంది. రాత్రి పదకొండు ఎప్పుడో దాటింది. నా మనసులో మూగిన చీకటిలా చిమ్మచీకటి. ఈరాత్రి అడివిలోనుండి ఆ ఊరుకుపోవడం నాకు అసాధ్యమే. అడివిమృగాల సంగతటుంచి, ఆయిధాలు ధరించిన మృగాలుకూడా తిరుగుతున్నాయి. అడివి మృగాలను తప్పుకోగలం కాని; ఆయుధాల మృగాలదే పెద్దబెడద. నా ప్రయాణాన్ని ఉదయానికి వాయిదా వేసుకోక తప్పని పరిస్థితి....

ఆ పరిస్థితిలో ఆహోటల్ గుడిసేలో చాలాసేపు కూర్చున్నాను.

ఐదేండ్ల కింద ఆగుడిసె ఎట్లా ఉండేదో? ఇప్పుడు అట్లాగేఉంది. (ముప్పయేండ్ల నుంచి దేశమెట్లా తగులబడ్డదో– ఆలోచిస్తే– గుడిసె గురించి ఆలోచించ నవసరం లేదు.) అదే ఆడమనిషి, గుండ్రటి మొఖం– నిర్జీవమైన పెడల్పుకళ్లు, బండబారిన పెదిమలు,....కాని....కాని ఆమె ముఖంలో ముడుతలు, తలలో నరుస్తున్న వెంట్రుకలు చెంపలు పీక్కుపోయిన ముఖం లాంతరు వెలుతురులో నన్ను చూసింది. చూసి చాలా సేపటిదాకా బిగుసుక పోయింది. అరగంట తరువాత నాదగ్గరి కొచ్చింది. కుర్చీ పక్క కూలబడ్డది. కూలబడి నాముఖంలోనికి అతి హృదయ విదారకంగా చూసింది.

డ్రైవరు, కండక్టరు బస్సులో గుర్రు కొడుతున్నారు. హోటల్లో నేను, ఆమె తప్ప ఇంకెవరు లేరు. గుడిసెబయట గ్లాసులు కడిగిన చప్పుడు.

"ఏడున్నరు. ఈడికి రావుటమే బంద సేసింద్రు. ఈడమరీ అన్యాయమయి పోయింది– దిన దిన గండమయితంది. ఈకుక్క బతుకులు మరింక బతికే దెవసం

రాలే." అని అటీటు పరకాయించిచూసి "మనిషిని మనిషి నమ్మేటట్టులేదు. బట్టకట్టి నోల్లంతా బద్మాషులే అంటండ్రు. లావు చెల్లిచ్చు కుంటండ్రు. సెడి సెల్లిచ్చుకునోళ్లంతా సాపియిదిని సెర్లకే పోతరుగని. ఈడ ఉసిల్లపుట్ట బెదిరినట్టుగ పోలీసోల్లు దిగిండ్రు. అబ్బబ్బ ఏంజెప్పాలె- అళ్ల ఉప్పాత మూడ్సుకపోను. ఒకటారెండా. ఎన్నని సెప్పాలె- కోడిపెట్టలు దక్కుతలేవు- కల్లుకుండ లాగుతలేవు- నాకైతె సావుకాలమచ్చింది. నాత్రికి నాతరొచ్చి గుడిసెమీన ఇరుగబడ్తరు. 'చా' కావాలంటరు. ఏన్నుంచి తేవాలె పాలంటె- 'లంజెకాన పిండిపొయ్యి మంటరు.' తెచ్చుకున్న కోల్లను అండి పెట్టుమంటరు. అదెపాయినంటె కారమెక్కువయ్యిందని తంతరు. సావల్లకాదంటె అది గోసే." నిట్టూర్చింది.

"ఈరీ!" ఎవదో బొంగురు గొంతోడు పిలిచిండు. ఆతరువాత బరిసె పట్టుకొని సుంకరోడు వానెనుక ఇద్దరు పోలీసోల్లు ప్రవేశించిండ్రు- పోలీసోల్లు తూలుతున్నరు. నాముఖంలో ముఖంపెట్టి చూసి ఒకడు ఇకిలించిండు. రెండవవాడు ఇదేమీ గమనించకుండా ఈరమ్మ వేపు ఆకలి చూపులు చూస్తున్నాడు. వాళ్లిద్దరి ఆకలి చూస్తే నిజానికి వాళ్లిద్దరిని అక్కడే ఖతం చేసి అక్కడే పాతెయ్యాల్సింది.... కాని నేను ఆపని చేయక అక్కడి నుంచి లేచి బస్సుదగ్గరి కొచ్చాను. కండక్టరును లేపి అనుమతి తీసుకొని బస్సులో పండుకున్నాను-

పడుకున్నానే కాని నిదుర రావడంలేదు- గుడిసెలో నుంచి ఈరమ్మ ఏడుపు వినిపిస్తోంది. వాళ్లిద్దరి బూతుమాటలు విన్నాకొద్ది రక్తము వేడెక్కుతోంది. "లంజకొడుకులు....లంజకొడుకులు-" అనుకున్నాను.

పల్లెటూరి పుంజులు ఉదయగమనాన్ని తెలుపుతూ గూసినయ్- టైం చూసుకున్నాను. నాలుగ్గంటలు, తొలికోడి కూతన్నమాట- కాసేపటికి ఇద్దరు పోలీసొల్లు బూట్లు చేతుల్లో వ్రేలాడుతుండగ అంగీలాగులు భుజాల మీదేసుకొని పోతున్నారు. అందులో ఒకడు తురకంలో ఏదో ఊరు పేరులేని పాట పాడుతున్నాడు. రెండవ వాడు బీడి తాగుతున్నాడు-

నేను లేచి గుడిసెలకు నడిచాను. ఈరమ్మ ఘోరమైన స్థితిలో చాతకాక మూల్గుతోంది- తట్టి లేపిన- "ఈరవ్వా! నేను మళ్లా రాకపోవచ్చు- అవ్వా! మనకూ మంచి రోజులొస్తాయి-" ఎందుకో నా కళ్లల్లో నీల్లు తిరుగుతున్నాయి. రానున్న మంచిరోజులు ఎన్ని బలిదానాలు కోరుకుంటాయో!.... కాసేపు చెప్పాలా వద్దా అని సంశయించాను- చెప్పకుండ ఉండలేకపోయాను.

453

ఆ తరువాత చాలాసేపు మాట్లాడలేదు- నేను గతంలోనే ఇంకా తచ్చాడుతున్నాను- ఆమె మాకెన్నోసార్లు అర్థరాత్రుల్లు అన్నం వండిపెట్టింది.

ఆమె సన్నగా ఏడుస్తున్నట్లనిపించి ఉలిక్కిపడి ఆమెముఖం చూశాను. నిజంగానే ఆమె ఏడుస్తోంది- ఓదార్చే శక్తిలేక ఆమెతలమీద చేయేసిన.... ఆమెను చూస్తే నాకు ఎప్పుడైనా మా అమ్మ గుర్తుకు వస్తుంది. నాచేయి ఆమె తలమీద పడడంతోటే ఆమె ఏడుపు ఇంకా ఎక్కువైంది.

"మీరిక్కడుండంగ గింతగనం చెల్లిచ్చుకోలే - నన్నయితే నిలువుత ముంచింద్రు అద్దమరాత్రి కలికి గాంధారెల్ల దొంంటికాన్నుంచి ఖబురచ్చింది- వానింట్ల పీనెగెల్ల వాని నాముసరుక- ఆకరుకు కమలపురం దొరోనిగతే ఈనికి పట్టదిగని- పిల్ల సెషామంటె సెషాము నేను బోనన్నది- 'ఇగో నేను సావనన్న సత్తగని గీ బతుకు బతుకనన్నది.' వచ్చిన నాలెముచ్చు సెందిరిగానితోని "అన్నా సెంద్రన్నా నాఅసొంటి సెల్లె నీకు ఉన్నది గదే"నన్నది. వాని నోట్లుచ్చ! సెందిరిగాడు పోయిన గుడిసేపటికి అరుగురు ధిరేసు లేసుకుని ఆడిదానిమీనికి ఈరాధి ఈరులు ధరిని కొమారులోలే పాహూసులు టకటక లాడిచ్చుకుంట అచ్చింద్రు- ఏం జెప్పాలే....కొడుకా ....దాన్ని...." ఆవిడ కంఠం మాటలురాక పూడుక పోయింది.

"ఏడువకు అవ్వా...."

"ఏడిత్తేమున్నది, అరుత్తేమున్నది బిడ్డా! నీబాంచెను ఆఖరుకు దాన్ని సారిటల కల్పినవని తానాకు పంపింద్రు. అన్నుంచి జేల్లకు తీసుక పోయిండ్రు- బిడ్డను సూసత్తామంటె పైస పైస ముదేసినా" ఆమె ఆగింది.

వార్త చెప్పాను....

ఆమె ఏవిధమైన మానసిక స్థితిలో అంత బాధలో ఆ వేకువలో మోకాల్లమీద తలపెట్టుకొని ఎంతసేపు ఏడ్చిందో.... ఎంతసేపని అలా ఏడ్వగలదు ? నేను చీకట్లో పల్లెదారిలో నడుస్తున్నాను- నిజంగా నాకు అక్కడే ఆ అడివి మధ్యలో కూర్చుండి బాగా ఏడువాలనే ఉంది.

వాడు చావు కూడ బతుకుకన్న విలువైన త్యాగంగా మరణించాడు- కాదు కాదు, దోపిడి సమాజం వానికి మృత్యువును ప్రసాదించింది.... కుట్ర చట్టాలు మానవునికే మృత్యువును ఖాయం చేసాయి.... ఎప్పటికయినా మానవుడిదే గెలుపు- కాని నాకు ఏడుపు వస్తోంది. బతుకు ఒక అవమానాల చీముపుండుగా, బానిసతనం ఒక వారసత్వ

వ్యాధిగా, పిరికితనం నెత్తుటి స్వభావంగా బతుకుతున్న వాళ్ల రోజూ చస్తూనేఉన్నారు. వాళ్ల గురించే నా ఏడుపంతా....

నా అడుగులు కాలిబాటవెంట పడుతున్నాయి. విప్పపూల వాసన- గాలిలో విప్ప చెట్లకింద గాజుల గలగల.... ఎక్కడో తునికిచెట్టు కాలిపోతోంది- వీటన్నిటికంటె వాడి జ్ఞాపకాలే నన్ను వెంటాడుతున్నాయి.... నా చేతిలోచెయ్యేసి నడుస్తున్నట్లుగా, నా కళ్లల్లో కళ్లుపెట్టి నవ్వుతున్నట్లు....

"పిరికిపందా, వీరుడు మరణించేది ఒక్కసారేరా!"

"వీళ్లు నన్ను చంపి ఇంతటితో ఆఖరనుకుంటున్నారు- కాని వేనవేల అడుగులు పడుతున్నాయి- కోట్లకొలది కంఠాలు ఘోషిస్తున్నాయి. నిజానికి ఈ సమాజం తన చావును తనే సిద్ధం చేసుకొంటోంది."

"రెండు మూడు వారాలకంటె ఎక్కువ వ్యవధి లేదు- నీకు బహుశా ఈ వార్త తప్పకుండా తెలుస్తుంది. ఈ సంగతి రుక్మిణికి చెప్పు- భోరున ఏడుస్తూ కాదుసుమా! సహజమైన విషయంలాగా చెప్పాలె- సెంటిమెంటనుకునేవు. ఆవిద నాతో ఆర్నెల్లు కాపురం చేసింది- ఇంకా స్వతంత్ర భావాలు లేనిమనిషి- ఆవిడను ఎడ్యుకేటుచేయండి. సరైన నిర్ణయం తీసుకోగలదని ఆశిస్తున్నానని చెప్పు."

"గుడ్‌బై.... రెడ్‌శాల్యూట్.... నా కండ్లను, గుండెను అన్నిటిని రానున్న తరాల కోసం యిచ్చేస్తా- గుడ్‌బై...." వాడింకా మీసాలదేటట్టు నవ్వుతూనే ఉన్నాడు.

"అగ్గిపెట్టె ఉందా?" నా ఎదురుంగ చీకట్లో ఎవరో నిలుచున్నారు. చేతులో గంపలాగున్నది.

అగ్గిపెట్టె తీసిచ్చాను. అతను చుట్ట వెలిగించు కున్నాడు.

"ఏవూరు మంది?" "ఏడికిపోవాలె?" అతను. నేను చెప్పాను-

'మసుకుండంగనే సేర్తవ్. రెండు మంచెల పెట్టుంటది."

నేను నడుస్తున్నాను....

చీకటి విచ్చుకొని వెలుగు రేకలు వారుతుండగా నేనా గుడిసె గడపలో అడుగు పెట్టాను. సంశయంతో బాధతో నా అడుగులు తడబడినై.

రుక్మిణి మోకాళ్ల మధ్య చెంబు పెట్టుకొని రెండు చేతులా బర్రెపాలు పితుకు తున్నది.

నెగడు కాడ బుర్ర మీసాల'వాడి' ముసలి తండ్రి చుట్టమీది నిప్పును తదేకంగా చూస్తూ కూర్చున్నాడు. ఇప్పల ఈదరకేమొ వాడి ముసలి తల్లి ఒంటినిండా పాత చీరె కప్పుకొని మోకాల్లమీద తల ఆనించి నేలను చూస్తోంది.

చుట్టమీది నిప్పు నెగట్లో పారేసి బుగ్గల నిండా పొగపీల్చి నన్ను చూసిండు. కను బొమ్మలు ముడుచు కున్నయి. నన్ను గుర్తు పట్టిండు.

"రారా అల్లుడా! ఎన్నిదినాలయ్యిందో చూసి. పాపిష్టి జన్మలకు కనపడుదే బందు సేసిండ్రి- రుక్కమ్మా ! పకాశ దచ్చిండు ఆ సెక్కకుర్చి తెచ్చేయమ్మా." అన్నడు.

రుక్మిణి పాలచెంబుతోసహా వచ్చింది- "ఏమన్న! అదినె పిలగండ్లు బాగున్నర- పేదోల్లం అంతదనుక రాలేం" అని ఇంకో ప్రశ్నను గుండెల్లోనే దాచుకొని నావేపు ప్రశ్నార్థకంగా చూసింది.

"ఎవలే- పకాశమా ? ఎప్పుడచ్చినవ్ కొడుకా ?" అంది బరువుగా 'వాడి' తల్లి.

మాటలను, మనుసును ముడుచుకొని కూర్చున్నాను.

అప్పుడే పితికిన వేడిపాలు గ్లాసెడు తెచ్చింది రుక్మిణి- వాడు నేను నేనంటే నేనని దెబ్బలాడుకుంటూ తాగేవాళ్లం.... వాడు లేకుండా నేనొక్కన్నే తాగాను....

"ఏమన్నో, బెల్లంగొట్టిన రాయోలె ఉలుకవు పలుకవు- వదినె రాంగ మాట్లా డద్దని మల్లమల్ల చెప్పిందా? రుక్కమ్మ కాడికిపోతన్నవ్ జేగర్తన్నదా ?" అని విరగ బడి నవ్వింది.

"అదికాదమ్మా" అన్నాను.... ఏదికాదో చెప్పలేక.

"ఔనులే- నా కెరికే...." అని ఇంకా విరగబడి నవ్వింది. రుక్మిణి నవ్వ కుండా ఒక్క క్షణమైన ఉండగలదా? గలగల నవ్వే రుక్మిణి ముఖంమీద విషాదాన్ని అద్దడానికేనా నేనొచ్చింది.... ఈ అమాయకురాలి గుండెల్లో అగ్ని రగల్చడానికేనా ఇంతదూరం ప్రయాణం చేసింది?

నవ్వుతోపాటు రుక్మిణి కళ్లల్లో నీల్లు నిలిచినయ్- అయినా కడుపు చేతపట్టుకొని ఇంకా నవ్వుతూనే ఉంది. అప్పుడే ఉదయించిన సూర్యుడి కిరణాలల్లో ఆ కన్నీళ్లు ధగధగ మెరిసినయ్- రుక్మిణి మంచాల్నుంచి లేవంగానే దిద్దుకున్న కుంకుంబొట్టు సూర్యునికి పోటీ పడుతున్నది.

నా కుర్చీ వెనుక చేతులేసి నిలబడిన రుక్మిణి కొంగు చేతిలోనికి తీసుకొన్న. రుక్మిణి కళ్లల్లో నిలిచిన నీల్లను తుడిచాను. నా కళ్లల్లో నీల్లు తిర్గినయ్. పెదిమలు వణికి

456

నయ్. అదే కొంగుతో నుదుట ఎఱ్ఱగా సూర్యునిలాగా మండుతున్న అగ్ని గోళం లాంటి కుంకుం బొట్టును తుడిచేశాను.

ముసలాయన నోట్లో చుట్ట కింద పడిపోయింది. రుక్మిణి నోరు మూసుక పోయింది.

వచ్చిన పనైపోయింది. లేచి నిలబడ్డాను.

బజార్లకు నడిచాను.

"నాన్న పకాశా! ఎంత పెద్ద కబురు తెచ్చినవ్‌రా! అయ్యో! నా తండ్రి...." ముసలాయన గుడగుడ శబ్దం చేస్తూ ఏడుస్తూ తిడుతున్నాడు.

వాడి తల్లి కుమిలి కుమిలి ఏడుస్తోంది.

వెనుతిరిగి చూశాను. రుక్మిణి నిలబడ్డ దగ్గరే కుప్పలా కూలిపోయింది. ఎటో పిచ్చి చూపులు చూస్తోంది.

అంతకంటె ఆ సమయంలో నేను ఏమి చెప్పగలను! ఉదయించిన సూర్యుని వెలుతురులో వాళ్ల, నేను నడవడం అనివార్యమైన విషయం....

చావు కూడ బతుకుకన్న విలువైన త్యాగంగా-
మరణించిన శూరులారా! వీరులారా!
అందుకోండి! అందుకోండి!!
లాల్ సలామ్.... లాల్ సలామ్....

(అంకితం : పీడిత ప్రజల కోసం వజ్ర సంకల్పంతో పోరాడి అమరులైన కామ్రేడ్సుకు వారి భార్యలకు- బంధువులకు-)

---

## కన్నీళ్ళలో అగ్ని గీతాలు

కన్నీళ్ళలో అగ్ని గీతాలు
జ్వలిస్తున్నాయ్
శ్రమ బిందువుల్లో
వైతాళిక రాగాలు వినిపిస్తున్నాయ్!

— ఎస్. మనోహర్

457